



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

బుధవారం 15 అక్టోబర్ 2025 - పేజీలు 8


# దీపావళి వేడుక..




# జాగ్రత్త మరువక..!




**నిర్వాహకులు నిబంధనలను తప్పక పాటించాలని కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు**

**నరసరావుపేట మేజర్ న్యూస్:** ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా.. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు.. తదితర అంశాలపై.. జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి డిఆర్వో, ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా

మిగతా 2 లో..

> బాణసంచా విక్రయకేంద్రాల నిర్వాహకులు నిబంధనలను తప్పక పాటించాలని కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు. షాపుల ముందు ఇసుక, నీటి బక్కెట్లు వంటి ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలను పాటించేల చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### చేయ దగినవి

1. లైసెన్సు కలిగి ఉన్న విశ్వసనీయ అమ్మకందారుల నుండి బాణసంచా కొనుగోలు చేయాలి
2. బాణసంచా వినియోగాన్ని ఎల్లప్పుడూ పెద్దలు పర్యవేక్షించాలి
3. బాణసంచాపై ముద్రించవబడిన భద్రతా జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలి
4. బాణసంచా కాల్చడానికి కొవ్వొత్తి లేదా అగర్బత్తిని వాడవలెను
5. ప్రారంభ మంటలను ఆర్పడానికి ఎల్లప్పుడూ ఒక బకెట్ నీటిని అందుబాటులో ఉంచండి
6. ఏరియల్ బాణసంచాను సురక్షిత ల్యాండింగ్ జోన్లో ఉపయోగించాలి
7. బాణసంచాను నీటిలో నానబెట్టి వాటిని సరిగ్గా పారవేయండి.

### చేయ కూడనివి

1.రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య శబ్దాలను వెదజల్లే బాణాసంచా పేల్చవద్దు

2. బాణాసంచాను చేతిలో పట్టుకొని కాల్చవద్దు. వాటిని క్రింద పెట్టి, ఆపై వాటిని మండించి, దూరంగా నడవండి

3. బాణసంచా కాల్చడానికి ఏదైనా కంటైనర్లో పెట్టవద్దు

4. ఏదైనా పనిచేయని బాణాసంచాను విడిచిపెట్టవలెను

5.బహిరంగ ప్రదేశంలోకి వెళ్ళే పథంలో అంతరాయం కలిగించే కట్టడముల ప్రవేశం, కిటికీలు దగ్గర ఎప్పుడూ ఏరియల్ (ఓవర్ హెడ్ అడ్డంకులు చెట్లు, ఆకులు, తీగ మొదలైనవి) బాణసంచా కాల్చవద్దు. భవనం/ఇండ్లు, కిటికీల వద్ద ఇతర బాణసంచా కాల్చకండి. ఓపెన్ గ్యారేజ్ డోర్/ విండో ఏరియల్ బాణసంచాను లోపలకు ఎగరడానికి అవకాశం ఇస్తుంది

6.ఇంటి లోపల ఎప్పుడూ బాణసంచా ఉపయోగించవద్దు

7. బహిరంగ మార్గంలో కాకుండా ఆరుబయట బాణాసంచా ఉపయోగించండి

8. ఎప్పుడూ బాణసంచాతో ప్రయోగాలు చేయవద్దు లేదా స్వంతంగా బాణసంచా తయారు చేయవద్దు

9. వెలగని బాణసంచాని మళ్లీ వెలిగించవద్దు (15 నుండి 20 నిమిషాలు వేచి ఉండి), ఆపై దానిని ఒక బకెట్ నీటిలో నానబెట్టండి

10. నకిలీ బాణాసంచా ఉపయోగించవద్దు

11. పిల్లలను ఒంటరిగా బాణసంచా కాల్చడానికి అనుమతించవద్దుగత్తలు ఖచ్చితంగా పాటించాలి

4. బాణసంచా కాల్చడానికి కొవ్వొత్తి లేదా అగర్బత్తిని వాడవలెను

5. ప్రారంభ మంటలను ఆర్పడానికి ఎల్లప్పుడూ ఒక బకెట్ నీటిని అందుబాటులో ఉంచండి.

## ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే
# భారీ పెట్టుబడులు

**గుంటూరు మేజర్ న్యూస్:** ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు ఏపీ చరిత్రలోనే కాకుండా.. దేశ ఐటీ చరిత్రలోనే ఇదొక పెద్ద మలుపు కానుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ దశ దిశ నాడు మైక్రోసాఫ్ట్‌తో మారిందని.. నేడు ఏపీలో గూగుల్ డాటా సెంటర్ ఆ పాత్ర పోషిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీకి గూగుల్ డాటా సెంటర్ రావడంలో ఐటీ మంత్రి లోకేష్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు

2 లో

# నగరపాలక సంస్థ కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో ఒకరి సస్పెండ్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



నగరపాలక సంస్థ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఉద్యోగ నియామక పత్రం అందించిన రికార్డ్ అసిస్టెంట్ ఎస్.నాగేశ్వరరావుని, ప్రజా ఫిర్యాదులు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శి వై.త్యాగరాజుని విధుల నుండి సస్పెండ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి సర్కిల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఎస్.నాగేశ్వరరావు కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, విజయవాడకు చెందిన జడ సుందరరావు అనే వ్యక్తి నుండి రూ.4.40 లక్షలు తీసుకొని, నకిలీ ఉద్యోగ నియామక పత్రం సృష్టించడం జరిగిందన్నారు. సుందరరావు నేరుగా కమిషనర్ కి ఫిర్యాదు చేయగా, డిప్యూటీ కమిషనర్ చేసిన విచారణలో ఎస్.నాగేశ్వరరావు కమిషనర్ సంతకం ఫోర్జరీ, నగదు తీసుకొని నకిలీ ఉద్యోగ నియామక పత్రం అందించినట్లు నిర్ధారణ జరిగిందన్నారు. విచారణ నివేదిక మేరకు నాగేశ్వరరావుని తక్షణం విధుల నుండి సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. ఏపిసిఎంఎంఎస్ లో పారిశుధ్య సమస్యలపై 45 వార్డ్ సచివాలయం పరిధిలోని ప్రజలు చేసిన ఫిర్యాదు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, పరిష్కారం చేసినట్లు వివరాలు నమోదు చేసిన శానిటేషన్ సెక్రెటరి వై.త్యాగరాజుని విధుల నుండి సస్పెండ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. పలుమార్లు చెప్పినప్పటికీ నిర్లక్ష్య వైఖరితో ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# గంజాయి రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దాలి



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గంజాయి రహిత జిల్లాగా పల్నాడు ను తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో ఎస్పీ కృష్ణారావు తో కలిసి మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.పాఠశాలల్లో, కళాశాలలో ఈగల్ టీం లను ఏర్పాటు చేసి మాదక ద్రవ్య వినియోగం వలన కలిగే నష్టాలను గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. అన్ని శాఖలు పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. . మున్సిపల్ కమిషనర్లు,మండల పరిషత్ అధికారులు వారి ప్రాంతాల్లో సమస్యాత్మక ప్రదేశాలు గుర్తించి వాటిలో గల పాత భవనాలు ఉండకుండా చూడాలన్నారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటాయని అన్నారు. వాటిని అరికట్టాలని అన్నారు. ఆ ప్రదేశాలలో సీసీ కెమెరాలు,

వివరాలు 2 లో



## ఘనంగా ప్రారంభమైన రక్షణ దళం ఆటల పోటీలు

**గుంటూరు మేజర్ న్యూస్:** ఏపీ ఎస్పీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఏ.పి.ఎస్.పి.ఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సి.యం.త్రివిక్రమ వర్మ, ఇన్స్పెక్టర్ జనరల్ బి.వి. రామి రెడ్డితో కలసి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడాప్రాంగణంలో ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో గల వివిధ యూనిట్ల నుండి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ నేతల దౌర్జన్యంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



గుంటూరు, మేజర్ న్యూస్: అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం మజరా బాలినాయినిపల్లి గ్రామానికి చెందిన రఘు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 810 లోని 0.05 సెంట్ల స్థలం గత 40 సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉంచుకొని కుటుంబంతో నివసిస్తూ తన కులవృత్తి అయిన చాకలి వృత్తితో జీవనం సాగిస్తున్నాను. అయితే 2023 సంవత్సరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు రాజకీయ కక్షతో కుట్ర పన్ని తన ఇంటిని కూలదోసి తన భార్య, పిల్లలను వీధి బాట పట్టించారు. జీవించడానికి మార్గం లేక బాడుగ ఇంట్లో నివసిస్తున్నాను. మదనపల్లి ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తే ఆయన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు సర్వే చేయడానికి ప్రయత్నించగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మళ్లీ దౌర్జన్యానికి పాల్పడి సర్వేను అడ్డుకుంటున్నారు. కావునా వారిపై చర్యలు తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, గుంటూరు జిల్లా డీసీఎమ్ఎస్ ఛైర్మన్ వడ్రానం హరిబాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్ధించాడు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కుటుంబ భవిష్యత్తు కోసం 2015 సెప్టెంబర్ 8న ఉద్యోగం కోసం కువైట్ దేశానికి వెళ్లాను. అయితే అక్కడకు చేరుకున్న తర్వాత వాగ్దానం చేసిన ఉద్యోగం ఇవ్వకపోగా బలవంతంగా తక్కువ వేతనంతో దారుణ పరిస్థితుల్లో పని చేయిస్తున్నారు. పాస్‌పోర్ట్‌ను యజమానులు స్వాధీనం చేసుకొని తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరింపులకు గురి చేస్తున్నారు. తిండి, నివాసం లేక తీవ్ర ఇబ్బందుల్లో రోజులు గడుపుతున్నాను. పైగా స్థానిక పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కావునా తక్షణ చర్యలు తీసుకోని స్వదేశానికి వచ్చేలా సాయం చేయాలని కోరాడు.

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామానికి చెందిన యస్.సి., యస్.టి., బి.సి. రైతులు సర్వే నెం. 504/33 %హా% నందు ఉన్న య.115.46 సెంట్ల చుక్కల భూమిలో గత 50 సంవత్సరాలుగా సాగు చేస్తూ ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తున్నాం. ఆర్.ఎస్.ఆర్. రిజిస్టర్ ప్రకారం చుక్కల భూమిగా నమోదై ఉంది. గతంలో సదరు సర్వే నెంబరులోని య.26.58 సెంట్లకు పట్టాలు జారీ కాగా, ఇంకా య.88.88 సెంట్లు నిల్వ భూమిగా ఉంది. భూమిపై ఎటువంటి ఆక్షేపణలు లేకుండా సాగు చేస్తున్నందున సదరు భూమిని కొలిచి పట్టాదారు పాస్‌బుక్స్, పట్టాలు జారీ చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం రామపురం గ్రామానికి చెందిన సురేష్ బాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత పంచాయితీ ఎన్నికలలో టీడీపీ తరపున పోటీ చేసినందుకు వైసిఆర్‌సిపి అనుచరులు కక్షతో తమ ఇంటికి వెళ్లే దారిని పూర్తిగా మూసివేశారు. ఈ దారి తమ కుటుంబం కలిసి వదులుకున్న మార్గం. ఎన్నిసార్లు అధికారులు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దారి లేకపోవడంతో తను ఆ ఇంటిని వదిలి వేరోక ఇంట్లో నివాసం ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు నీటి కాలువ సమస్యతో పొరుగువారి పంటలు నాశనం అవుతుండగా అదే కారణంగా తనపై అక్రమ కేసు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్ధికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్ధనలు అందించారు.

# గంజాయి రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి..

లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అటువంటి సమస్యాత్మక ప్రదేశాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సమస్యాత్మక ప్రదేశాల్లో ఉన్నటువంటి భవనాలు ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినవయితే వారికి నోటీసులు ఇచ్చి వాటిని ఉపయోగంలోనికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వంకు సంబంధించినవి అయితే వాటిని వెంటనే తొలగించాలన్నారు. పోలీస్ శాఖ వారు పాఠశాలలకు, కళాశాలకు, వసతి గృహాలకు వెళ్ళి విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసినట్లు,మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అసంపూర్తిగా నిర్మించిన భవనాలు, ఖాళీగా వదిలివేసిన భవనాలలో కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదై, ఎక్కువ మొత్తంలో గంజాయి సరఫరా చేస్తూ లేదా అమ్ముతూ దొరికిన వారి ఆస్తులు జప్తు చేస్తామన్నారు.మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు స్కూళ్లస్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థలలో ఈగిల్ క్లబ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఏరియా హాస్పిటల్ నందు ఉన్న డీ-అడిక్షన్ సెంటర్, కొత్తగా ఏర్పాటైన డీ-అడిక్షన్ సెంటర్ నందు అవసరమైన సిబ్బందిని నియమించాలని డీఎంహెచ్ఓ ను కోరారు.మాత జ్ఞానమ్మ డీ-అడిక్షన్ సెంటర్ ను సైకియాట్రిస్ట్ గారు నెలకు రెండు సార్లు విజిట్ చేయాలన్నారు. మాదక ద్రవ్య దుర్వినియోగ నిర్మూలన లో బాధ్యతాయుతమైన అన్ని శాఖల సమన్వయంతో చురుకుగా పాల్గొనాలన్నారు. మాదక ద్రవ్యాల పై అవగాహన ఇంటర్ - డిపార్ట్‌మెంటల్ సహకారంతో వీలైనన్ని ఎక్కువ అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మరియు ప్రజలలో మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై చైతన్యం కలిగించాలని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దీపావళి వేడుక.. జాగ్రత్తలు మరువక..!

మొదటి పేజీ తరువాయి..

పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే.. విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.నిబంధనల మేరకు షాపులు ఏర్పాటు చేస్తున్నారా లేదా అని రెవిన్యూ అధికారులు తనిఖీ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓలు అన్ని బాణసంచా తయారీ గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి.. అనుమతులు ఉన్నవాటికి పర్మిషన్లు, పర్మిషన్ ముగిసిన స్టాళ్లకు రెన్యూవల్ చేయించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తమ పరిధిలో లైసెన్స్ ఇచ్చే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని అందరూ ఆర్డీవోలను ఆదేశించారు. అందుకు సంబంధించి విధివిధానాలను ఇప్పటికే సంబందిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో.. ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టపాకాయల విక్రయ దుకాణదారులు సురక్షాపరమైన జాగ్రత్తలు తీసుకోనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు ,పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దీపావళి పండుగ నిర్వహించుకోవాలని టపాకాయల విక్రయదారులు కమిటీ సభ్యులకు సూచించారు. బాణసంచా విక్రయ శాలల మధ్య నిబంధనలకు లోబడి డిస్టెన్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలి. స్టాళ్ల ముందు అన్నిరకాల బాణసంచాకు సంబంధించి ధరల పట్టికలను బహిరంగంగా ప్రదర్శించాలి. స్టాళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. ప్రజలు, విక్రయదారులు సురక్షిత చర్యలు తీసుకుని దీపావళిని ఆనందంతో, సంతోషంతో జరుపుకోవాలని కోరారు. ఎటువంటి ప్రమాద పరిస్థితులకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ,జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు ఖాళీ చేయాలి

గుంటూరు మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఉత్తర్వుల మేరకు అనధికార హోల్ సేల్ కూరగాయల వ్యాపారాలు చేస్తున్న అనుమతి లేని అన్నపూర్ణ కాంప్లెక్స్ లోని వ్యాపారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, లేకుంటే కోర్ట్ ఉత్తర్వుల మేరకు బుధవారం జిఎంసి అధికారులు సీజ్ చేస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్ లో మాత్రమే రైతులు తమ కూరగాయలను విక్రయించుకోవడానికి అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా జాతీయ రహదారి సర్వీస్ రహదారిలో, నిర్దేశిత అనుమతులు లేని అన్నపూర్ణ కాంప్లెక్స్ లో వ్యాపారాలు చట్టవ్యతిరేకమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారద మార్కెట్ లో లీజు గడువు ముగిసిన 81 షాపులకు 3 రోజుల పాటు పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించి, గతంలో షుమారు రూ.81 లక్షల ఆదాయం వచ్చే షాప్ లకు రూ.6 కోట్లు ఏడాదికి జిఎంసికి ఆదాయం వచ్చేలా నిర్వహించామన్నారు. సదరు వేలంలో కొత్తవారితో పాటు అప్పటివరకు వ్యాపారం చేసుకున్నవారు కూడా పాల్గొన్నారని తెలిపారు. కాని మార్కెట్ లోని వ్యాపారులు కొందరు ప్రస్తుతం షాప్ లు పొందిన వారి వ్యాపారాన్ని దెబ్బతీసేలా కొందరి ప్రోద్బలంతో అనధికారికంగా జాతీయ రహదారి వెంబడి, షుమారు రూ.3 కోట్లకు పైగా ఖాళీ స్థల పన్ను బకాయి పెండింగ్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని, నివాస అనుమతులు ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ లో వ్యాపారాలు చేస్తున్నారన్నారు. వారితో నేరుగా తామే మాట్లాడి, అనధికార వ్యాపారం సరికాదని, రైతులలను గందరగోళ పరిచేలా



వ్యవహరించవద్దని, చట్టప్రకారం అనుమతుల కోసం దరఖాస్తు చేయాలని సూచించామన్నారు.

అన్నపూర్ణ కాంప్లెక్స్ నిర్వహకులకు ఇప్పటికే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశామని, వారు హైకోర్ట్ లో కేసు దాఖలు చేయగా కోర్ట్ ఈ నెల 10వ తేదీలోపు కాంప్లెక్స్ ని ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయగా, సదరు కాంప్లెక్స్ నిర్వాహకులు మరి కొంత కాలం గడువు కోరగా కోర్ట్ అనుమతి ఇవ్వలేమని, తక్షణం ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చెసిందన్నారు. కోర్ట్ ఉత్తర్వుల మేరకు బుధవారం అన్నపూర్ణ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాప్ లను సీజ్ చేస్తున్నామని తెలిపారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే భారీ పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి..

వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ సంస్థను సంప్రదించి...నిరంతరం ఫాలో అప్ చేయడం వల్లే లక్ష్యాన్ని చేరుకున్నామని సీఎం అన్నారు. ఢిల్లీలో గూగుల్ సంస్థ నిర్వహించిన భారత్ ఏఐ శక్తి సదస్సులో పాల్గొన్న అనంతరం అమరావతికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ అంటూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలతో సీఎం చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు. ఏఐ డాటా సెంటర్‌తో విద్య, వైద్య, వ్యవసాయంలో కీలక మార్పులు ఏఐ డాటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలని నేతలకు సూచించారు. సామాన్యులకు సైతం డేటా సెంటర్ ప్రయోజనాలేంటో తెలిసేలా అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన ఈ భారీ పెట్టుబడి తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. '30 ఏళ్ల క్రితం ఐటీని ప్రోత్సహించినప్పుడు నాడు సమాజంలో ఆ రంగంపై ఇంత అవగాహన, చర్చ, పోటీ లేదు. కానీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఉన్న అవకాశాలను నాడు ఊహించి ప్రణాళికలు అమలు చేశాం. దీనికోసం అనేక విమర్శలను కూడా ఎదుర్కొన్నాం. నాడు ముఖ్యమంత్రులు కంపెనీల కోసం విదేశాలకు వెళ్లి పెట్టుబడులు ఆకర్షించిన సందర్భాలు లేవు. అయితే విదేశాల్లో తిరిగి, దావోస్ పెట్టుబడుల సదస్సులకు వెళ్లి పరిశ్రమలు తెచ్చేందుకు పయత్నాలు చేశాం. అనేక ప్రయత్నాలతోనే హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ సహా



అనేక కంపెనీలను తెచ్చి ఐటీకి పునాది వేశాం. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేసింది. అనేక కంపెనీలు రావడానికి నాడు మైక్రోసాఫ్ట్ కారణం అయ్యింది. నేడు విశాఖకు వస్తున్న గూగుల్ ఏఐ డాటా సెంటర్ పెట్టుబడి కూడా అంతే ప్రభావాన్ని చూపుతుంది. విశాఖను ఐటీ హబ్‌గా చేసేందుకు మనం చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో పెద్ద ముందడుగు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



## రూ.30 లక్షలతో మండాదిలో సీసీ రోడ్లు

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండలం, మండాది గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించబడుతున్న సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదేవిధంగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. మండాది గ్రామంలోని టిడిపి నాయకులు గ్రామస్తులకు మౌలిక వసతులు అందించే దిశగా కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. మాజీ టిడిపి మండల అధ్యక్షుడు గుజ్జుల పాపిరెడ్డి, వెల్దుర్తి ఎంపీడీవో ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కోట నెమలిపురిలో కార్డాన్ సర్చ్

**రాజుపాలెం మేజర్ న్యూస్:** మండలంలోని కోట నెమలిపురి గ్రామంలో ఉదయాన్నే సుమారు 80 మంది పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు, గ్రామంలో పేపర్లు లేనటువంటి బైకులు 23, ఒక ఆటో దొరికాయని, వాటిలో కొన్ని పేపర్స్ ఉన్నాయని అంటున్నారు పరిశీలించి వాటిని ఇవ్వటం జరుగుతుందని, లేకపోతే ఆ బండ్లన్నీ సీజ్ చేసి కోర్టుకి పెడతామని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు, అదేవిధంగా గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామంలో ఇటీవల ఇరు వర్గాలకు విభేదాలు వచ్చినట్లు మా దృష్టికి రావడం జరిగిందని, ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎవర్నెస్ కోసం కార్డాన్ సర్చ్ నిర్వహించడం జరిగిందని, ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని డీఎస్పీ హనుమంతరావు గ్రామస్తులకు తెలిపారు, అదేవిధంగా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కాలేజీల్లో గంజాయి కి అలవాటు పడుతున్నారని, విద్యార్థులు తల్లిదండ్రులు పిల్లల మీద కొంచెం దృష్టి ఉంచి, వాళ్లని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డి.ఎస్.పి తెలిపారు.

## ప్రధాని పర్యటన నేపథ్యంలో కూటమి నేతల సమన్వయ సమావేశం



**గుంటూరు మేజర్ న్యూస్:** ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా.. జరుగుతున్న ఏర్పాట్లపై కర్నూల్ లోని స్టేట్ గెస్ట్ హౌస్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం ఈ నెల 16 న కర్నూల్ లో జరిగే సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ సమావేశానికి 3 పార్టీల అధినేతలు వస్తున్న క్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కలిసి పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించిన నేతలు సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

# సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తులో 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా చేతుల మీదుగా పదోన్నతి పత్రాలను అందుకున్నారు. చైర్ పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితం క్రమశిక్షణతో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కిందిస్థాయి సిబ్బందితో కలిసిపోయి పనిచేయాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగికి సమయ పాలన ముఖ్య మన్నారు. సీనియర్ అసిస్టెంట్ల నుండి ఎవోలుగా పదోన్నతి పొందిన కూచిపూడి మోహన్ రావు, (ప్రత్తిపాడు) వి.పద్మజారాణి, (శవల్యాపురం) పి.శారదేవి, (పెదకాకాని) కె.అమరేశ్వరరావు, (నాదెండ్ల) శ్రీనివాసరావు, (ఈపూరు) ఎం.ప్రసాద్ (రాజుపాలెం) వై.లవ కుమార్, (పిట్టలవానిపాలెం) ఎం.సురేష్‌బాబు, (నకరికల్లు) ఎస్.కిషోర్ కుమార్, (కొల్లిపర) డి.శ్రీనివాసరావు, (గురజాల) ఎన్. విద్యాసాగర్ (రొంపిచర్ల)లకు పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో జ్యోతి బసు డిప్యూటీ సీఈఓ సిహెచ్ కృష్ణ బండి శ్రీనివాస్ అకౌంట్ ఆఫీసర్ సామ్యూల్ పాల్ ఏవో రత్న బాబు



పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాస్, జిల్లా నాయకుడు పూర్ణచంద్ర రెడ్డిలు ఏవోలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ పదోన్నతి మండలంలో చాలా కీలకమైనదని చెప్పారు. ఎంపీడీవో సెలవులో ఉన్నప్పుడు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని విభాగాలలో పట్టు సాధించి ఉన్నతాధికారుల సమావేశంలో అడిగిన విషయాలను తడపడకుండా చెప్పాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో పాఠశాల సామాగ్రి అందజేత

**గుంటూరు మేజర్ న్యూస్:** పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పర్యావరణం కోసం మొక్కలు నాటడం, ప్రజల సంపూర్ణ ఆరోగ్య కోసం శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలకు రోటరీ క్లబ్ ప్రాధాన్యత ఇస్తుందని, నాగేంద్రుడు మాష్టారు వంటి దాతల సహకారంతో వాటిని నెరవేర్చడంలో కొంత పురోగతి సాధిస్తున్నామని రోటరీ క్లబ్ అఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షులు యేరువ వెంకటనారాయణ అన్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆఫీస్ కు అవసరమైన బీరువా , ఓబయ్య కాలనీ లోని మండల విద్య వనరుల కేంద్రానికి అవసరమైన మైక్ సెట్‌ను క్లబ్ వారు అందజేశారు దాత నాగేంద్రుడు మాస్టార్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. షేక్ బాజీ, ట్రెజరర్ పొత్తూరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**గుంటూరు, మేజర్ న్యూస్:** వసతి గృహాలలో ఉన్న ప్రతీ ఒక్క విద్యార్థికి పూర్తి ఆరోగ్య పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికాతులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో తాగునీటి వసతులు, సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖలతో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. మొత్తం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించుటకు ఎన్ని రోజులు పడుతుంది, తదనుగుణంగా ఏ రోజు ఏ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేది కార్యాచరణ తయారు చేయాలని అన్నారు. దీపావళి తరువాత ఈ కార్యక్రమంను చేపడతామని చెప్పారు. ప్రతీ వసతి గృహం తాగునీరు, పారిశుధ్యం లోపం లేకుండా ఒక వ్యక్తిని బాధ్యులుగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు.చెన్నయ్య, బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మయూరి, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గా భాయి, పాల్గొన్నారు.

## కనక నారాయణ మృతికి చీఫ్ విప్ జీవి సంతాపం

**శావల్యాపురం మేజర్ న్యూస్:** మండలంలోని వయకల్లు గ్రామ మాజీ ఉపసర్పంచ్, ప్రముఖ కళాకారుడు కర్రె కనక నారాయణ (60) మృతికి ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు సంతాపం తెలిపారు. కనక నారాయణ గ్రామంలో టిడిపి నాయకుడిగా, మాజీ ఉపసర్పంచ్ గా పనిచేసే ప్రజలకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. గ్రామంలో ప్రజలకు, పార్టీకి, రాష్ట్రవ్యాప్తంగా కలహారంగానికి కనక నారాయణ అందించిన సేవలను గుర్తు చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## గూగుల్ రాకతో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది..!



**మాచర్ల మేజర్ న్యూస్:** గూగుల్ రాకతో రాష్ట్రం సర్వముఖాభివృద్ధి దిశగా పయనిస్తుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఏడాది పాటు శ్రమించి, నేషనల్ పాలసీలో మార్పులు చేసి మరి 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే గూగుల్ క్లౌడ్ ను సంస్థను రాష్ట్రానికి తీసుకురావడం ఆషామాషి విషయం కాదన్నారు. హైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్ రావడంతో అక్కడ సాంకేతిక అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో, అలానే గూగుల్ క్లౌడ్ ఏపీకి రావడం భవిష్యత్తులో అభివృద్ధికి గేమ్ చేంజర్ గా మారనున్నదని స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతి పెద్ద ఏఐ సంస్థను గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని ఆయన వివరించారు. విశాఖ వేదికగా వివిధ దేశాలకు కంప్యూటర్ డేటా పంపేందుకు బ్రాడ్ బ్రాండ్ వేగాన్ని పెంచేందుకు గూగుల్ సంస్థ సముద్ర గర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన చెప్పుకొచ్చారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి రావడంపై అందరూ ప్రశంసిస్తుంటే.., స్వాగతించాల్సిందిపోయి, గూగుల్ క్లౌడ్ సంస్థపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సి.పి.ఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** అత్యవసర పరిస్థితుల్లో మన తోటి వారి ప్రాణాలు కాపాడే విధానమే “కార్డియో పల్మనరీ రిసస్టేషన్ “ అని జిల్లా ఎన్.ఎస్.ఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.పి.ఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని టీజెపిఎస్ కళాశాల, బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ మహిళా కళాశాల నందు ఏర్పాటుచేసిన అవగాహన తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆపత్కర పరిస్థితులలో కార్డియాక్ అరెస్టుకు గురై గుండె పనిచేయడం ఆగిపోయినప్పుడు సి.పి.ఆర్ ప్రక్రియ ద్వారా మనిషి, ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా సమాజంలో ప్రతి ఒక్కరూ సిపిఆర్ పట్ల మెలకువలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన తెలిపారు. పాశ్చాత్య దేశాలలో 60 శాతం మంది పౌరులకు సిపిఆర్ అవగాహన ఉంటుందని, కానీ మనదేశంలో కనీసం ఒక్క శాతం మందికి కూడా సిపిఆర్ విధానం తెలియకపోవటం దురదృష్టకరమని, అన్ని కళాశాలలో రెడ్ క్రాస్ వారి సహకారంతో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో సిపిఆర్ అవగాహన తరగతులు ఏర్పాటు చేస్తామని డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కౌసల్యాదేవి మాట్లాడుతూ మారుతున్న ప్రజల జీవనశైలి వలన చిన్న వయసులోనే అనేకమంది గుండె జబ్బులకు గురవుతున్నారని, అనేకమంది కార్డియాక్ అరెస్టులకు గురై మృత్యువాత పడుతున్నారని దీనికి నివారణ మార్గం మంచి ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం, వ్యాయామం మాత్రమేనని ఆవిడ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు కళాశాలలు,



కమ్యూనిటీ సెంటర్స్, పరిశ్రమలు తదితర విభాగాలలో ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమని ఆవిడ అన్నారు. ఈ కార్యక్రమంలో టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కామేశ్వరరావు, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు పద్మజ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## తెనాలిలో మంత్రి మనోహర్ వేదాశీర్వచన సభ

**తెనాలి, మేజర్ న్యూస్:** నూకల రామకోటేశ్వరావు కళ్యాణమండపంలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ వేదాశీర్వచన సభ గురువారం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షులు లక్కరాజు లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు చీవుకుల దుర్గాప్రసాద్, నరసింహమూర్తి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు మెంబర్ పెద్దిభోట్ల లక్ష్మీనారాయణ, దుర్గగుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ సుబ్రహ్మణ్య కుమార్, విజయవాడ కౌతా ధర్మ సంస్థల అధినేత కౌత సుబ్బారావు, తెలీదేవరపల్లి శ్యాంసుందర్ శర్మ, పట్టణ బ్రాహ్మణ పలువురుప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి మనోహర్ చేతుల మీదుగా ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కాలర్షిప్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఇటీవల లా లో 9 గోల్డ్ మెడల్ సాధించిన విజ్ఞాన్ లా కాలేజీ ప్రొఫెసర్ భాగవతుల నాగ సాయి శ్రీరామ్ కు చిరు సత్కార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి తెనాలి మరియు పరిసర ప్రాంత బ్రాహ్మణ్యం పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్యంగా నాదెండ్ల మనోహర్ కు ఘనపాటిలచే బ్రహ్మాండమైన వేద ఘన స్వస్తి ఉన్నట్టుగా తెలిపారు. సమావేశంలో, త్రిపురారి పట్ల దత్తు , చెన్నా పరగడ శ్రీనివాస్, విష్ణుపట్ల మణి కిషోర్, దావులూరి శ్యామ్ సుందర్ శర్మ, నందివెలుగు రామకృష్ణ శర్మ, కొడవటిగంటి కుమార్, అద్దేపల్లి మాధవ శాస్త్రి లక్కరాజు లక్ష్మణరావు ప్రభృతులు పాల్గొన్నారు.

# త్రాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్ చేయాలి

**గుంటూరు మేజర్ న్యూస్:** నగరంలో నగరపాలక సంస్థ సరఫరా చేసే త్రాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్ చేయాలని, ఎక్కడైనా పైప్ లైన్ లీకులు గుర్తిస్తే తక్షణ మరమత్తు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ భారత్ పేట, అరండల్ పేట, అశోక్ నగర్, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో పిజిఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ లో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నేరుగా పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత



**పులి శ్రీనివాసులు**

అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా త్రాగునీటి సరఫరా జరిగే సమయంలో తప్పనిసరిగా శ్యాంపిల్స్ సేకరించాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో క్లోరిన్ టెస్ట్ లు చేసి, నిర్దేశిత రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. పైప్ లైన్లు డ్రైన్లకు సమాంతరంగా ఉన్నా, లీకులు ఉన్నా వెంటనే షిఫ్ట్ చేయడం, మరమత్తు చేయాలని ఏఈలను ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్ లో త్రాగునీటి సరఫరాపై ఫిర్యాదు చేసిన భారత్ పేట, అరండల్ పేటల్లో ఫిర్యాదుదారి నివాసంలోని త్రాగునీటిని త్రాగి పరిశీలించామని, వాటిలో కలుషిత ఆనవాళ్లు లేవన్నారు. ప్రజలు కూడా స్థానిక సమస్యల పరిష్కారం కోసం వార్డ్



సచివాలయాల కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలన్నారు. రెడ్డిపాలెంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య పనులపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, డంపింగ్ కుప్పలు లేకుండా, ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను, ప్రజల రాకపోకలకు వీలుగా శివారు ప్రాంతాల్లో తొలుత వెట్ మిక్స్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## గత ప్రభుత్వంలోనే అధిక కల్తీ మద్యం

**మాచర్ల మేజర్ న్యూస్:** గ్రామాల్లో కూడా కల్తీ మద్యం మరియు గంజాయి అమ్ముతున్న కూడా గత వైసీపీ ప్రభుత్వం లో ఎటువంటి చర్య తీసుకోలేదని గంజాయి వనం చేసింది వైసిపి పార్టీ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో గంజాయి పంటను పూర్తి గా ధ్వంసం చేసి, గంజాయి రహిత రాష్ట్రముగా చేసిన ఘనత మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుది .నకిలీ మదగన్ రెడ్డి ముఠా, జగన్ రెడ్డి కుటుంబం నడుపుతున్న" రెడ్డీస్ గ్లోబల్ "కంపెనీ తయారు చేసిన నకిలీ మద్యంగ్యాంగ్ అని వెల్లడించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాచర్లలో రచ్చబండ

**మాచర్ల మేజర్ న్యూస్:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం కింద కోటి సంతకాల సేకరణ మంగళవారం మాచర్ల మండలంలో ప్రారంభమైంది. ప్రజా వైద్య సేవలను కాపాడే క్రమంలో ఈ



కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు బూడిద శ్రీనివాసరావు, విజయపురి సౌత్ గ్రామ కమిటీ అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి, జిల్లా మహిళా విభాగం సభ్యులు లాకా వెంకటరమణ, అనుబంధ విభాగాల అధ్యక్షులు బీర్నేది రమేష్, సంతవరపు లక్ష్మీనారాయణ, ఏరువ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గ్రామ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజా వైద్య రంగాన్ని ప్రైవేటు ఆధీనంలోకి ఇచ్చే యత్నాన్ని ఆపేందుకు ప్రతిఒక్కరూ ఈ సంతకాల సేకరణలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.



## కోట నెమలిపురి లో కార్డెన్ సర్చ్ నిర్వహించిన డి.ఎస్.పి

**రాజుపాలెం మేజర్ న్యూస్:** మండలంలోని కోట నెమలిపురి గ్రామంలో ఉదయాన్నే సుమారు 80 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు, గ్రామంలో పేపర్లు లేనటువంటి బైకులు 23, ఒక ఆటో దొరికాయని, వాటిలో కొన్ని పేపర్స్ ఉన్నాయని అంటున్నారు పరిశీలించి వాటిని ఇవ్వటం జరుగుతుందని, లేకపోతే ఆ బండ్లన్నీ సీజ్ చేసి కోర్టుకి పెడతామని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు, అదేవిధంగా గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామంలో ఇటీవల ఇరు వర్గాలకు విభేదాలు వచ్చినట్లు మా దృష్టికి రావడం జరిగిందని, ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎవర్నెస్ కోసం కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగిందని, ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని డీఎస్పీ హనుమంతరావు గ్రామస్తులకు తెలిపారు, అదేవిధంగా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కాలేజీల్లో గంజాయి కి అలవాటు పడుతున్నారని, విద్యార్థులు తల్లిదండ్రులు పిల్లల మీద కొంచెం దృష్టి ఉంచి, వాళ్లని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డి.ఎస్.పి తెలిపారు.

# తెనాలిలో నడిరోడ్డుపై వ్యక్తి హత్య



**తెనాలి, మేజర్ న్యూస్:** తెనాలి పట్టణంలోని చెంచుపేటలో నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం జరిగింది. ముఖానికి మాస్క్ పెట్టుకుని స్కూటీపై వచ్చిన దుండగుడు కొబ్బరి బొండాల కత్తితో వ్యక్తిని హతమార్చి, అదే స్కూటీపై పరారయ్యాడు. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోడితాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి బుజ్జి (50) దాదాపు పది రోజుల క్రితం చెంచుపేటలోని కైలాష్ భవన్ రోడ్డులో నివాసముంటున్న తన కుమార్తె వద్దకు వచ్చాడు. స్థానికంగా రోడ్డుపై ఉన్న టిఫిన్ సెంటర్ కు వచ్చి ద్విచక్ర వాహనంపై కూర్చుని మరో వ్యక్తితో మాట్లాడుతుండగా, దుండగుడు ముఖానికి మాస్క్ ధరించి స్కూటర్పై వచ్చాడు. బుజ్జి పై కొబ్బరి బొండాలు నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వెంటనే అదే స్కూటీపై దుండగుడు పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బుజ్జి రక్తపు మడుగులో కుప్పకూలి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటనపై టిఫిన్ సెంటర్ నిర్వహించే మహిళతో పాటు స్థానికులు నివ్వెర పోయారు. తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న డి.ఎస్.పి బి జనార్ధనరావు, త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానికులను ఘటనపై విచారించారు. ఆ రోడ్డులో సిసి టీవీ ఫుటేజ్ పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. మృతుడు కోడితాడిపర్రు గ్రామానికి చెందిన తిరుపతిరావు పెదపూడి సొసైటీ సభ్యులుగా ఉన్నారు. గ్రామంలోని సొసైటీ దేవాలయానికి సంబంధించిన వ్యవహారంలో విభేదాల కారణంగా హత్య జరిగిందన్న అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**తెనాలి, మేజర్ న్యూస్:** పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా లీటరుకు రూ. 8 నుండి రూ. 10 రూపాయలు ప్రోత్సాహక ధర ఇవ్వాలని కోరుతూ ఈ నెల 25 న తెనాలి నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల జిల్లా ప్రధమ మహాసభ జరుగుతుందని పాల రైతులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. ఈ మేరకు తెనాలిలోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణమండపంలో మంగళవారం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేద కొనుగోలు ధర లక్ష రూపాయలు పైగా అయిందని గతంలో ఎకరం వరిగడ్డి నాలుగు నుంచి ఐదు వేల రూపాయలు దొరికేది కానీ హార్వెస్ట్ కారణంగా అన్ని ఖర్చులు కలుపుకొని 20000 అవుతుందని దాంతోపాటు తవుడు దానా పశువుల మందులు ధరలు ఎప్పటినుండి పెరిగాయని ఆయన తెలిపారు. కానీ గేదె పాలు 40 రూపాయలు ఆవుపాలకు 20 రూపాయలు మించి డైరీలో పడటం లేదని ఆయన ఆవేదన చెందారు. బ్యాంకులు కోపరేటివ్ సొసైటీలు గేదెలకు రుణాలు ఇవ్వటం లేదని ప్రైవేటు డైరీలు పై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడం వల్ల లక్షల్లో పెట్టుబడి పెట్టి కోట్లలో లాభాలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం పాల ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గించేట్లయితే



అమెరికా విదేశాల నుంచి పాల ఉత్పత్తులు ఎప్పటి ముప్పడిగా దిగుమతి అయి పాల రైతులు అవుతారని తెలిపారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ మార్కెట్ ధర ప్రకారం నిర్ణయించి ఇవ్వాలని ప్రభుత్వమే ప్రీమియమును చెల్లించాలని పాల రైతుల సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తెలిపారు. పశువుల ఆసుపత్రిలో డాక్టర్లు సిబ్బందిని మందులను అందుబాటులో ఉంచాలని కల్తీ పాలను కట్టడి చేసి ప్రజలు క్యాన్సర్ భారి నుండి ప్రజలను కాపాడాలని కోరారు. పాల రైతుల సమస్యలను ప్రభుత్వం ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 25వ తేదీ తెనాలి నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణమండపంలో జరిగే పాల రైతుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి టీ శాంతకుమారి మాన్యం పద్మ ఎల్లమాటి మేరమ్మ కేశకుంతల ఏ సరోజిని టీ నిర్మల ఈ సంతోషం టీ నేరమ్మ సుశీల పాల్గొన్నారు.

# జీఎస్టీతో ఇంటి నిర్మాణం సులభతరం: కమిషనర్ పులి



గుంటూరు మేజర్ న్యూస్: నిర్మాణ రంగ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులకు ఇంటి నిర్మాణం సులభమయ్యే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "బిల్డింగ్ డెవలపర్స్, కన్స్ట్రక్షన్ మెటీరియల్స్" అంశంపై క్రెడాయ్, నరేడ్కో, బిఏఐ సభ్యులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, కన్స్ట్రక్షన్ మెటీరియల్ సప్లయర్లు (సిమెంట్, పెయింట్స్, ఇంటీరిర్, ఎక్స్టీరియర్), హార్డ్వేర్ షాపుల ఎగ్జిబిషన్ స్థానిక ఏసి కాలేజి సెమినార్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఎగ్జిబిషన్ లోని స్టాల్ లో జిఎస్టీ తగ్గింపు కు పూర్వం, ప్రస్తుతం ఎంత ధరలు ఉన్నదీ తెలుసుకొని, ప్రతి ఒక్కరూ తగ్గింపు ధరలతోనే విక్రయించాలని తెలియచేస్తూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులుబాటుని కల్పించిందన్నారు. ప్రధానంగా నిర్మాణ రంగ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా సాదారణ ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాడానికి వీలు కల్గుతుందన్నారు. అలాగే ప్రస్తుతం నిర్మాణం చేసే అపార్ట్మెంట్లలో కూడా ప్లాట్ లు గతం కన్నా తగ్గింపుతో ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి సంస్థ తగ్గింపు ధరలతో కూడిన బోర్డ్ లను కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిఎంసి ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా జిఎస్టీ తగ్గింపు పై ఈ నెల 19 వరకు ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పోరేటర్ పి.సమతా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, డిసిపి సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ సన్మాన సభకు కైతేపల్లికి ఆహ్వానం



తెనాలి, మేజర్ న్యూస్: ఈనెల 19వ తేదీన గుంటూరులోని ఎన్జీవో కళ్యాణమండపంలో ఎన్జీవో కార్యనిర్వహక వర్గం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ జవహర్ సన్మాన సభకు తెనాలికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజును మంగళవారం కలిసి సభకు ఆహ్వానం అందించారు. తెనాలి చెంచుపేట లోని ఆయన నివాసంలో గుంటూరు ఎన్జీవో ప్రధాన కార్యదర్శి సుద్దపల్లి శ సుకుమార్, సీనియర్ న్యాయవాది ఉప్పులూరి శరత్ తదితరులు విచ్చేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్ ఎస్ టి కమిషన్ చైర్మన్ జవహర్ ను 19వ తేదీన ఘనంగా సన్మానించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్జీవో సభ్యులు ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.కార్యక్రమంలో డిఆర్డిఓ ఉద్యోగి కొండముది కిషోర్, గుంటూరు జిల్లా ఎంఈఎఫ్ ప్రధాన కార్యదర్శి మోషే, గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన నిర్వహకులు పినపాటి రవికుమార్, మాజీ ఏపీపీ ఇందుపల్లి రాజారాం, న్యాయవాది శుద్ధపల్లి మురళీధర్, నలుపుర్తి సద్గుణ రావు, ఎన్జీవో కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెం సచివాలయంలో పనిచేయని కంప్యూటర్లు

**పట్టించుకోని అధికారులు**

**సర్టిఫికెట్స్ కి సంబంధించిన స్టేషనరీ లేక వైట్ పేపర్లపై ప్రింట్లు**

**అవస్థలు పడుతున్న ప్రజలు**



రాజుపాలెం మేజర్ న్యూస్ : మండల హెడ్ క్వార్టర్ లోని రాజుపాలెం సచివాలయంలో గత రెండు నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ కంప్యూటర్ చెడిపోయింది. నెల క్రితం పంచాయతీ సెక్రెటరీ కి ఇచ్చిన కంప్యూటర్ కూడా చెడిపోయింది. రెండు నెలల నుండి డిజిటల్ సేవలు సెల్ ఫోన్ లోనూ, లేదా పక్కన ఎవరైనా కంప్యూటర్ దగ్గరకు వెళ్లి, వాళ్లని బతిమిలాడి వర్క్ చేసుకుంటూ రావడం జరుగుతుంది, ఇప్పుడు పక్కన వాళ్ళు కూడా కంప్యూటర్ ఎవరు ఇవ్వట్లేదు అని చేతులెత్తేయడంతో అర్జీలు పెట్టాలన్న, సర్టిఫికెట్లు తీసుకోవాలన్న అవస్థలు పడుతున్న విద్యార్థులు, రైతులు, అదేవిధంగా గ్రామ సచివాలయంలో 690 కి పైగా సేవలు అందుబాటులో ఉండగా, వాటికి సంబంధించి వన్ బి, అడంగల్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్ ఇలా అనేక సేవలకు సంబంధించి ప్రింట్ తీయటానికి గవర్నమెంట్ అందజేస్తున్న సర్టిఫికెట్ స్టేషనరీ లేక వైట్ పేపర్ల మీద ప్రింట్లు తీసిస్తున్న వైనం, అధికారులకు చెప్తే అప్పుడే అయిపోయాయా తెప్పిస్తాలే అంటూ సమాధానం చెబుతున్నట్టు సమాచారం, గవర్నమెంట్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సేవలు అందించే కార్యక్రమం చేస్తుంటే కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెడిపోయిన కంప్యూటర్ ను బాగు చేయించి ప్రజలకు సేవలు అందించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.




# వెల్దుర్తి మండలానికి రికార్డు స్థాయి గౌరవం

**96 మంది కొత్త ఉపాధ్యాయుల నియామకాలు**

*వెల్దుర్తి మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నోటిఫికేషన్ ఫలితాలతో వెల్దుర్తి మండలం విద్యారంగంలో చారిత్రాత్మక ఘట్టాన్ని సృష్టించింది. మండల పరిధిలో మొత్తం 96 మంది అభ్యర్థులు నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో నియమితులై తమ సేవలను ప్రారంభించారు. విషయాలవారీగా చూస్తే ఇంగ్లీష్ సబ్జెక్ట్లో 5 మంది, హిందీలో 1 మంది, తెలుగులో 7 మంది, బయోలాజికల్ సైన్స్లో 6 మంది, గణిత శాస్త్రంలో 3 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గా 5 మంది, ఫిజికల్ సైన్స్లో 4 మంది, సోషల్ స్టడీస్లో 6 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లుగా 58 మంది ఇలా మొత్తం 96 మంది అభ్యర్థులు ఎంపిక కావడం వెల్దుర్తి మండల చరిత్రలోనే రికార్డు స్థాయి సంఖ్యగా నిలిచింది. ఈ నియామకాలు మండలంలోని పాఠశాలల్లో బోధన నాణ్యతను మరింతగా పెంచుతాయని స్థానిక విద్యా అధికారులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ.., ఇంతమంది కొత్త గురువులు రావడం వల్ల మన పిల్లల భవిష్యత్తు ప్రకాశవంతం అవుతుంది అని ఆనందం వ్యక్తం చేశారు.*




# నకిలీ మద్యం తయారీ పై ర్యాలీ

నరసరావుపేట మేజర్ న్యూస్ : నకిలీ మద్యం తయారీ పై పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు రోడ్ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుండి ప్రకాష్ నగర్ లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసిన నిరసన ర్యాలీలో మహిళలోకం కదం తొక్కింది. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో వందలాదిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి
## నకరికల్లు తహసీల్దార్ పుల్లారావు



నకరికల్లు మేజర్ న్యూస్: మీడియా సమావేశం నిర్వహించిన నకరిక ల్లు తహసిల్దార్ పుల్లారావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలో దీపావళి స్టాల్స్ ను ఏర్పాటు చేయకూడదని అనుమతి పొందిన తర్వాతే స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. బాణా సంస్థ విక్రయ దుకాణదారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా మండల పరిధిలో వ్యాపారాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేయక తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రమాదాలకు తావు లేకుండా సరైన భద్రత ప్రమాణాలు పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు జన సంచారం లేని ప్రదేశాలలో మాత్రమే టపాసులను నిల్వ ఉంచుకొని వ్యాపారాలు జరుపుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా అగ్ని మాపక శాఖ అధికారులతో ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు

# నానో యూరియా పై రైతులకు అవగాహన
## తెలియపరచిన వ్యవసాయ శాఖ అధికారులు

నకరికల్లు మేజర్ న్యూస్: నకరికల్లు మండలంలోని రూపెనిగుంట్ల గ్రామంలో రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి కే. దేవదాస్ నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయవసాయ సంచాలకులు పిడుగురాళ్ల శ్రీ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు పాల్గొని నానో యూరియా వాడకం గురించి రైతుల్లో ఉన్నటువంటి సందేహాలను నివృత్తి చేశారు. ఎకరాకు 500 ఎమ్ఎల్ నానో యూరియాను 200 నీటికి కలిపి వరి పంటపై పైపాటుగా పిచికారి చేయడం ద్వారా నత్రజని పంట మొక్కలు త్వరగా గ్రహించడం జరుగుతుందని,అలాగే వాతావరణ పొల్యూషన్ తగ్గుతుందని రైతులకు వివరించారు. నానో యూరియా 500 %ఎశ్రీ% పూర్తి ఖరీదు ?225 అని రైతులకు తెలియపరిచారు. అన్ని పంటల లో పై పాటుగా నానో యూరియా వాడవచ్చని రైతులకు తెలియపరచారు. రైతు సేవ కేంద్రం ద్వారా యూరియా ఎరువుల పంపిణీ విధానాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే దేవదాసు మాట్లాడుతూ నకరికల్లు మండలంలో పిఎసిఎస్ నకరికల్లు, చీమలమర్రి రూపినిగుంట్ల రైతు సేవ కేంద్రాల ద్వారా 50 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేయడం జరిగింది అని తెలియపరిచారు. అందరూ రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ పంట నందు పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియపరిచారు. మండలంలోని ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం నకరికల్లు బ్రాంచ్ నందు 25 టన్నుల యూరియా ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షులు తిరుమల శెట్టి వెంకట్రావు పంపిణీ చేయటం జరిగిందని. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు పిడుగురాళ్ల శ్రీ భక్తుల శ్రీకృష్ణదేవరాయలు రావడం జరిగింది, అలాగే మండల మండల వ్యవసాయ అధికారి దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు వై. ప్రభాకరు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు



# దుగ్గిరాలలో ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్
## ప్రాజెక్ట్ ఏర్పాటుకు కసరత్తు

దుగ్గిరాల ,మేజర్ న్యూస్ .దుగ్గిరాల పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ ను మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి అర్జున్ రావు పరిశీలించారు. దుగ్గిరాల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు పంచాయతీ అధికారులు పరిశీలన చేసి 16 లక్షల తో ప్లాస్టిక్ వేస్ట్ సైకిల్ ప్రాజెక్టు ఏర్పాటుకు వసతులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు . కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం నారాయణస్వామి, కమిషనర్ పంచాయతీ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డిఎల్పిఓ స్వరూప రాణి ,ఎంపీడీవో ఏ .శ్రీనివాసరావు ,డి ఈఈ సతీష్ ,కన్సల్టెంట్ మురళి ,గ్రామ సర్పంచి బి. ఖుషి భాయ్ ,పంచాయతీ కార్యదర్శి కె. వివేకానంద ,రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు ,మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ ,సచివాలయ సిబ్బంది ,పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి బంగారం మాయమై తిరిగి ప్రత్యక్షమైన సంఘటన పై సమగ్ర విచారణ జరపాలి

**పెద్దకాకాని మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పెరకాకానిలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారి బంగారం మాయం ప్రత్యక్షం పై సమగ్ర విచారణ జరపాలని పెదకాకాని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ రావు డిమాండ్ చేశారు మంగళవారం పెదకాకానిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ భ్రమరాంబ అమ్మవారికి దాత సమర్పించిన 132 గ్రాముల వడ్డాణంలో 30 గ్రాముల బంగారం తగ్గిందని గత మూడు నెలల క్రితం దేవాదాయ శాఖ జ్యువలరీ వెరిఫికేషన్ అధికారి తెలియజేశారని అప్పటి నుండి తగ్గిన బంగారం జమ చేయాలని ఆలయ అధికారులు అర్చకులకు సూచించినప్పటికీ పెడచెవిన పెట్టడం ఇటీవల అర్చకుల మధ్య బహిరంగ వాగ్వివాదం జరగటంతో విషయం బయటికి పోకడం జరిగిందని అమ్మవారి వడ్డాణంలో బంగారం తగ్గిన విషయం అన్ని దినపత్రికలలో అమ్మవారి బంగారం మాయం అనే శీర్షికలు రావడంతో అర్చకులు అధికారులు కుమ్మక్కై రాత్రికి రాత్రి అమ్మవారి వడ్డాణంలో తగ్గిన 30 గ్రాముల బంగారం ఆభరణాలు భద్రపరిచే బీరువాలు దొరికినట్టు కట్టు కథ అల్లారని పేర్కొన్నారు పెదకాకాని శివాలయంలో వరుసగా జరుగుతున్న సంఘటనలు భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఇటీవల భక్తుల పట్ల ఓ అర్చకుడి ప్రవర్తన చర్చాంసనీయం మైందని తిరిగి ఇప్పుడు ఆలయ గర్భగుడిలో అమ్మవారి బంగారానికే రక్షణ కరువైందని పేర్కొన్నారు ఈ సంఘటన శివ భక్తులకు అమ్మవారి భక్తులకు తీవ్రంగా కలిచి వేసిందని ఇలాంటి సంఘటనల వలన ఆలయానికి అమ్మవారికి స్వామివారికి కానుకల సమర్పించే దాతలు సైతం వెనకడుగు వేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు ఆలయంలో పనిచేసే కొంతమంది అధికారులు కొంతమంది అర్చకులు గ్రూపులుగా విడిపోయి కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని కొందరైతే మాకు ఫలానా వారి అండ ఉందని నేను ఫలానా వారికి చెందిన మనిషినని భక్తులను బెదిరించటం జరుగుతుందని ఆలయంలో రాజకీయాలు చేయడం సరైనది కాదని ఆయన తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెదకాకాని శివాలయం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజా నిజాలు భక్తులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని ఆయన తెలిపారు ఆలయంలో వరుసగా జరుగుతున్న సంఘటనలపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కి అలాగే దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు విలేకరులతో తబందెల ఉదయ శంకర్ ఆలూరి వెంకట్రావు బండ్లమూడి భాను కిరణ్ దానబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి

**పల్లెల్లో పచ్చదనం పరిశుభ్రత శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి**

**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ సజావుగా ఉండాలని, పరిశుభ్రత తో కూడిన పచ్చదనం పెంపొందించాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సజావుగా జరగాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల లోని థీమ్ 5 అయిన పరిశుభ్రత మరియు పచ్చదనం పై మండలం లోని సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం ను నిర్వహించడం జరిగిందని ఎంపిడిఓ బండి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శిక్షణ ను ప్రారంభించిన ఎం పీ డీ వో మాట్లాడుతూ ఇలా చేయడం వల్ల ఎల్ ఎస్ డీ జీ థీమ్ 5 అయిన క్లీన్ అండ్ గ్రీన్ యొక్క లక్ష్యాన్ని అందుకున్నట్లే అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం లో జరిగే అన్ని కార్యక్రమాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. శిక్షణ లో భాగంగా



పరిశుభ్రత- పచ్చదనం, ఘన వ్యర్థాల నిర్వహణ మరియు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ రథం, హరిత రాయబారుల హక్కులు మరియు అవకాశాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమం కు మాస్టర్ ఆఫ్ ట్రైనర్లు గా డిప్యూటీ ఎంపిడిఓ షేక్ అజీజుర్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, కాల్వపల్లి అంజి రెడ్డి, చిలువూరి కృష్ణ ప్రసాద్ లు వ్యవహరించారు. ఈ క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ కార్యక్రమం బుధ వారం మండలం లోని హరిత రాయబారులకు, గురువారం యానిమేటర్ లకు, శుక్ర వారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఓ పేర్కొన్నారు.

# పచ్చళ్ళ తయారీ విధానాల కొరకు దుగ్గిరాలలో పర్యటన

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్.** టెక్ పార్క్ తయారీ కి సంబంధించి విధివిధానాల కోసం జిల్లాలో పచ్చళ్ళు తయారు చేసే లబ్ధిదారులతో ఇంట్రాక్ట్ అయ్యేందుకు మంగళవారం దుగ్గిరాల గ్రామంలో అధికారులు పర్యటించారు. గుంటూరు జిల్లాలోని తాడికొండ మండలంలో 22 కోట్ల రూపాయలతో టెక్ పార్కు ను తయారు చేసే నేపథ్యంలో. దుగ్గిరాల లోని లబ్ధిదారులతో సమావేశమయ్యారు. నీలేంద్ర ముఖర్జీ , రాజశ్రీ ,పి .శేఖర్ మూర్తి , కిరణ్ కుమార్ , అశోక్ కుమార్, పున్నారావు ఏపిఎం లు సుబ్బారావు , నాగేశ్వరరావు , సాంబశివరావు విజయభారతి ప్రియదర్శిని ,శ్రీలక్ష్మి ,చక్రవర్తి , దుగ్గిరాల మండల ఏపీఎం సురేష్ కుమార్ ,,ఎంఎస్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, లబ్ధిదారులు ,ఎస్బిఐ, యూబీఐ అధికారులు తదితరులు హాజరైనారు.




# 8వ రాష్ట్రీయ పోషణ మాసం వేడుకలు

**సీడీపీవో రాజేశ్వరి**

**మాచవరం, మేజర్ న్యూస్:** మాచవరం మండలంలోని మొర్జంపాడు గ్రామంలో ఐసిడిఎస్ పిడుగురాళ్ల ప్రాజెక్టు పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ,బాలింతలు పోషక ఆహారాన్ని తీసుకున్నట్లయితే తల్లి ,బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆమన్నారు. ఐసిడిఎస్ ద్వారా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పోషక పదార్థాల గురించి అంగనవాడి కేంద్రాల్లో అంగన్వాడి కార్యకర్త ద్వారా వివరించడం జరుగుతుంది అని ఆమె అన్నారు. డి సి పి యు కౌన్సిలర్ 8వ రాష్ట్రీయ పోషణ మాసం గురించి వివరించారు. మండలంలోని మాచవరం, కొత్తపాలెం ,తు రకపాలెం, మొర్జంపాడు మల్లవోలు, కొత్త గణేష్ పాడు పిన్నెల్లి,




తదితర గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. మొర్జంపాడు గ్రామం ఎస్సీ అంగన్వాడి సెంటర్లో ఈ కార్యక్రమం జరిగిందనిఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎ.వెంకటలక్ష్మి , కే కోటేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎం ఏ ఎం కళాశాలలో సి. పి.ఆర్ వారోత్సవాలు

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** స్థానిక కేసానిపల్లిలో గల ఎం ఏ ఎం ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమ రెడ్ క్రాస్ నేషనల్ హెడ్ కోటర్స్ న్యూఢిల్లీ , ఆంధ్ర రాష్ట్ర శాఖ వారి ఆదేశాల మేరకు ఈ నెల 13 నుండి 17 వరకు అవగాహన కార్యక్రమాలను వివిధ కళాశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు నాడీ మరియు శ్వాస అందని సమయంలో ఆ వ్యక్తి కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడని గుర్తించి సి.పి.ఆర్ ను అందించాలని సి.పి.ఆర్ అంటే ఆగిపోయిన గుండెను ఊపిరితిత్తులను తిరిగి పనిచేసే విధంగా చేసే ప్రక్రియనే సి.పి.ఆర్ అంటారని , 30 సార్లు గుండె పై మర్దనలు. రెండుసార్లు కృత్రిమ శ్వాసను అందించాలని ఈ విధంగా నిమిషానికి 120 సార్లు మర్దనలు 8 సార్లు కృత్రిమ శాసన అందజేయాలని ఇలా చేయడం ద్వారా వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చునని, కాబట్టి ప్రతి ఒక్కరు సి పి ఆర్ చేసే విధానాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ హెచ్ ఓ డి ఎస్ వి శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఫ్యాకల్టీస్ జోసెఫ్ స్వాతి , తదితరులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సమాలోచన

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ .**దుగ్గిరాల గ్రామంలోని బాలికల పాఠశాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించేందుకు అధికారులు. మంగళవారం పాఠశాలలో సమావేశమైనారు . బాలికల పాఠశాలలోని విద్యను అభ్యసిస్తున్న సుమారు 400 మంది బాలికల కు సంబంధించి వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించేందుకు అధికారులు స్థల ఎంపికను చేసేందుకు సమాయత్తమైనారు . ఈ కార్యక్రమంలో. రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు శ్రీ గూడూరు వెంకటరావు ,మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, గద్దె శ్రీనివాస్ , పాఠశాల హెచ్ఎం ఎస్ .శోభా దేవి , మృత్యుంజయ రావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# షాపుల నిర్మాణానికి స్థలాలు పరిశీలన

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** ఏపీ లో పట్టణ పేదల పేదరిక నిర్మూలనకు కీలక పాత్ర పోషిస్తున్న మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పవర్టీ ఇన్ మ్యూనిసిపల్ ఏరియాస్ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల (గ్రూపులు) ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తాత్కాలిక షాపుల నిర్మాణానికి మంగళవారం మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2007లో స్థాపించబడిన ఈ సంస్థ రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో (అల్బీలు) స్వయం స్థిరమైన సంస్థలను ప్రోత్సహించడం, బలోపేతం చేయడం మరియు సంరక్షించడం ద్వారా పట్టణ పేదల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహిస్తోంది. పట్టణంలోని ఆరు ముఖ్య ప్రాంతాలను – ముఖ్యంగా రహదారి రోడ్ మార్జిన్‌లు, వాణిజ్య కేంద్రాల సమీపంలో ఉన్న ప్రదేశాలు – పరిశీలించిన ఈ బృందం, వ్యాపారానికి అనువున్న ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణానికి అనుకూలతను అంచనా వేసింది. ఈ ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణం, మెప్మా సభ్యులకు అప్పందుకోవడం నరసరావుపేట మున్సిపాలిటీ బాధ్యతగా ఉందని, ఇక్కడ మెప్మా ఐరన్ కంటైనర్లు, మోడ్యులర్ వెండింగ్ యూనిట్ల వంటి తాత్కాలిక షాపులను ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇలాంటి మోడ్యులర్ వెండింగ్ మార్కెట్లకు రూ. 26.10 కోట్లు కేటాయించబడినట్టు తెలిపారు. 580 షాపులకు సంబంధించిన ప్రాజెక్టులు గ్రూపుల బ్యాంకు రుణాలు, మెప్మా మద్దతు మరియు మున్సిపల్ నిధుల ద్వారా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ తాత్కాలిక షాపుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 2.74 లక్షల గ్రూపులకు చెందిన 22.62 లక్ష మంది మహిళలు తమ ఉత్పత్తులను – హస్తకళలు, ఆహార పదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులు వంటివి – మార్కెటింగ్ చేసుకోవచ్చని అన్నారు., ఇది మెప్మా కార్యక్రమాల్లో భాగంగా 123 అల్బీల్లో అమలవుతోందని తెలిపారు. “మెప్మా ద్వారా ఏర్పాటు చేసే ఈ తాత్కాలిక షాపులు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేస్తాయని అన్నారు. నరసరావుపేట పట్టణంలోని ఆరు ప్రాంతాల్లో ఈ స్థలాలు ఎంపిక చేసిన తర్వాత, రోడ్ మార్జిన్‌లలో ప్లాట్‌ఫారమ్‌లు నిర్మించి, మెప్మా సభ్యులకు అప్పందుకుంటామన్నారు. ఐరన్ కంటైనర్లు, మోడ్యులర్ యూనిట్లతో తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసి, గ్రూపులు తమ ప్రొడక్టులను విక్రయించుకోవడానికి అవకాశం కల్పిస్తామున్నారు. ఇది మా నియోజకవర్గంలోని గ్రూపుల మహిళల ఆర్థిక ఎదుగుదలకు కీలకమైనదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22.62 లక్ష మంది మహిళలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతి నెలా సగటున రూ. 5,000 నుంచి రూ. 15,000 వరకు అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు” అని ఎమ్మెల్యే అన్నారు. మెప్మా కార్యక్రమాలు డెయ్-నల్మ్ (డెవలప్మెంట్ ఆఫ్ వుమెన్ అండ్ చైల్డ్రన్ ఇన్ అర్బన్ ఏరియాస్) కింద రాష్ట్రంలో పట్టణ మహిళల సాధికారతకు ముఖ్యమైనవి. ఇటీవల మెప్మా, ఓఎన్‌డీసీ, మైస్టోర్, హెూమ్‌ట్రయాంగిల్ వంటి ఈ-కామర్స్ భాగస్వాములతో ఎమ్‌ఓయూలు కుదుర్చుకుని గ్రూపుల ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తోంది. అలాగే, రాపిడో వంటి ఆప్‌లతో భాగస్వామ్యం ద్వారా 1,000 మంది మహిళలకు డ్రైవర్ ఉద్యోగాలు కల్పించారు. ఈ వంటి మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్‌లు గ్రూపుల ఆదాయాన్ని గణనీయంగా పెంచుతున్నాయని, పట్టణాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు త్వరలోనే ఏడు నగరాల్లో ఏర్పాటు అవుతాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నరసరావుపేట పట్టణంలోని గ్రూపులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభించడంతో ఆర్థికంగా బలపడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారులు, మెప్మా సిబ్బంది, స్థానిక గ్రూపు ప్రతినిధులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు.



## వృద్ధులకు ఆర్థిక సహాయం

**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ నియోజకవర్గం, ఈపూరు మండలం, ఊడిచర్ల %రాజ% కాలనీ లో అరుంధతి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంగల వీరయ్య, పున్నమ్మ 70 సంవత్సరముల వృద్ధులకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో అరుంధతి సేవ ఫౌండేషన్ అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు గారు మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా గత 15 సంత్సరాల నుండి పేద ప్రజలకు సహాయం చేయడం జరుగుతుంది అని మాట్లాడుతూ భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు చేస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ సంఘం సెక్రటర్ కట్టేంపూడి బర్న, ఈ సంఘం జాయింట్ సెక్రేటరు శిఖా రామయ్య, శిఖా కోటేశ్వరరావు, నాలేగపల్లి నాగయ్య, పత్రా లింగయ్య, కడియం మరియబాబు, దారివేముల దాసు, పెద్దిటి బాల, వీరదాసు అప్పయ్య, గుద్దటి వెంకట కోటయ్య, నంబూరి సాంసోను, కాకాని బ్రహ్మనాయుడు, బీసిపోగు రామస్వామి, మొండితోక ఏసుబాబు, నంబూరి మోషే, తరితరులు పాల్గొన్నారు.

## గుంటూరుకు చెందిన సైనికుడు మృతి



**గుంటూరు క్రైమ్ మెజర్ న్యూస్:** రాజస్థాన్ లోని సైనిక స్థావరంలో యుద్ధ విన్యాసాలు చేస్తూ గుంటూరు సంగడిగుంటకు చెందిన తేజ్ భరద్వాజ్ మరణించారు. దేశ సేవ పై మక్కువతో సైన్యంలో చేరి ఇలా విన్యాసాలు చేస్తూ ప్రమాదవశాత్తు భరద్వాజ్ మరణించడంతో అటు సైన్యంలోనూ, అటు కుటుంబంలోనూ తీరని శోకాన్ని నింపింది. ప్రమాదానికి సంబంధించి వివరాలు తెలియాల్సింది.

## వాటర్ టాంక్ చుట్టూ ప్రక్కల శుభ్రం చేయడం జరిగింది




**గుంటూరు, మేజర్ న్యూస్:** చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం వాటర్ టాంక్ చుట్టు ప్రక్కల శుభ్రం చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. "అపరిశుభ్రంగా వీరనాయకపాలెం నీటి టాంక్ పరిసరాలులి శీర్షికన ఒక దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తపై ఆయన స్పందిస్తూ టాంక్ పరిసరాలలో పిచ్చి మొక్కలను 20 రోజుల క్రితమే శుభ్రం చేయించడం జరిగిందని, అయితే వర్షాలు ఎక్కువగా పడటం వలన వెంటనే గడ్డి మొలవడం జరిగిందన్నారు. ఆయా పరిసర ప్రాంతాలలో ఎక్కడ మురుగు నీరు నిలువ లేదని, వాటర్ ట్యాంకు ఇండ్ల మధ్యన ఉండటం, నిత్యం ప్రజల రాకపోకలు జరగటం వలన, అక్కడ ఎటువంటి మలమూత్ర విసర్జనలు జరగటం లేదని పేర్కొన్నారు. డోసింగ్ పంపు సహాయంతో రోజు క్లోరినేషన్, 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ కూడా చేయించడం జరుగుతుందన్నారు. పి.డబ్ల్యూ.ఎస్ పథకం చుట్టు ప్రక్కల సుందరంగా ఉంచటానికి కంచె, గేటు ఏర్పాటు చేయుటకు గ్రామ పంచాయతి తీర్మానం కూడా చేయడం జరిగిందని వివరించారు. దానిని త్వరలోనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించడం జరిగిందన్నారు.

# లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

### ఇతర దేశాల వ్యక్తులు లాడ్జిలకు వస్తే వ్రాతపూర్వకంగా తెలియజేయాలి: ఈస్ట్ డీఎస్పీ అజీజ్



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్:** కొత్తపేట పరిధిలోని లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ లాడ్జి ఓనర్లను హెచ్చరించారు. నేర నియంత్రణ లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈస్ట్ డి.ఎస్.పి ఎస్ కె అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల లాడ్జి ఓనర్స్, నిర్వాహకులతో స్థానిక సీఐ ఎం వీరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించిన ఎడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు అనగా లాడ్జి లలో పేకాట, వ్యభిచారం, మద్యం సేవించుట గంజాయి అమ్మట, తాగుట లాంటి కార్యక్రమాలకు అనుమతించరాద న్నారు. అలాగే మైనర్ బాల బాలికలకు లాడ్జిలలో రూమ్ లు అద్దెలకు ఇవ్వా రాదన్నారు. కాలేజీ, పాఠశాలలకు సంబదించిన విద్యార్థి, విద్యార్థినులకు రూములు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ప్రతి లాడ్జి నందు సీసీ కెమెరాలు ఒక నెలకు తక్కువ కాకుండా స్టోరేజ్ ఉండేటట్లు చూసుకొనవలెను, ఎపుడు కప్పుడు సీసీ కెమెరా ఫూటేజ్ ను సీడీల ను భద్రపరిచి అవసరం అయినప్పుడు పోలీస్ వారికీ అందించలన్నారు. ఇతర దేశములుకు, ఇతర రాష్ట్రాలుకు సంబందించిన వ్యక్తులు ఎవరైనా మీ లాడ్జి నందు వసతి తీసుకుంటే వ్రాత పూర్వకంగా పోలీస్ స్టేషన్ కు తప్పనిసరిగా తెలియజేయాలనీ సూచించారు. లాడ్జిలలో అన్ని రికార్డ్స్ లను, రిసెప్షన్ రిజిస్టర్, పని చేయు సిబ్బంది వివరాలతో కూడిన రిజిస్టర్ , మునిసిపాలిటి/కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు నుండి అనుమతి పొందిన కాగితాలు అన్ని తనిఖీ సమయంలో చుపించాలన్నారు. ఈ సమావేశంలో కొత్తపేట ఎస్సై లు రమేష్, సుబ్బారావు, పోలీస్ సిబ్బంది లు పాల్గొన్నారు.

## డ్రగ్ అబ్యూస్, సైబర్ సెక్యూరిటీ' లపై అవగాహన




**గుంటూరు మేజర్ న్యూస్:** యువజన సర్వీసుల సర్వీసుల శాఖ- స్టెప్ (స్వశక్తి), గుంటూరు వారి ఆధ్వర్యములో 'డ్రగ్ అబ్యూస్, సైబర్ సెక్యూరిటీ' లపై అవగాహన కార్యక్రమమును 14 న ఎం బి టి ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, నల్లపాడు నందు నిర్వహించడం జరిగినది. కార్యక్రమమునకు అధ్యక్షత వహించిన టి.శేఖర్, ఎంబి టీఎస్ ప్రిన్సిపాల్,ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, నల్లపాడు వారు తమ ప్రారంభ ఉపన్యాసము ద్వారా ఆయా రంగాల నిపుణుల సలహాలను పాటించవలసిన అవసరాన్ని తద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకొనవలసినదిగా కోరినారు. కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జి. భానోదయ, డి.ఎస్.పి, ఎస్ డి ఎస్ పి సౌత్ గుంటూరు జిల్లా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగము వలన యువత వారి ఆరోగ్యముతో పాటు వారి జీవితమును నాశనము చేసుకొనుచున్నారని మరియు అనైతిక చర్యలకు పాల్పడటం తద్వారా సమాజములో గౌరవాన్ని కోల్పోవడమే కాక, చట్ట పరిధిలో శిక్షలను అనుభవించవలసివస్తుందని, చెడు వ్యసనాలకు దూరముగా ఉండి యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరినారు. కార్యక్రమమునకు హాజరైన బి. రాధిక, మేనేజర్, యువజన సర్వీసుల శాఖ, స్టెప్, గుంటూరు వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరు అప్రమత్తతగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారము అందించకుండా తగు జాగ్రతగా వ్యవహరించాలని కోరుతూ, సైబర్ క్రైమ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వాటి నుండి ఎలా జాగ్రత్తలు వహిందాలో వివరించినారు. కార్యక్రమములో వి. సాయి సాత్విక్, జూనియర్ అసిస్టెంట్, స్టెప్, గుంటూరు మరియు ఎం బి టి ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, నల్లపాడు అధ్యాపకులు సిబ్బంది పాల్గొనినారు.



## అలసత్వం వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

**గుంటూరు, మేజర్ న్యూస్:** నీటి సరఫరా వ్యవస్థలో నిర్లక్ష్యం వహించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో తాగునీటి వసతులు, సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖలతో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పర్యవేక్షణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వివిధ దశలలో నిర్దేశిత సమయంలో చేపట్టాల్సిన పరీక్షలు నిర్వహించకపోయినా, పైప్ లైన్లు నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా ప్రజా ఆరోగ్యం పట్ల తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అధికారులు, సిబ్బంది తమ దీర్ఘకాలిక అనుభవంతో ప్రజలకు మంచి జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మీదట ఎక్కడా ఎటువంటి సంఘటనలు రాకూడదని స్పష్టం చేశారు. తాగునీటి నమూనాలు సేకరించి నప్పుడు ఎక్కడ నుంచి సేకరించింది స్పష్టంగా వివరాలు పొందుపరచాలన్నారు. తాగునీటి నమూనాల సేకరణ, వాటి పరీక్షలు, ఫలితాలు, ఇతర నివేదికలు నిర్దేశిత కాలంలో చేయాలని ఆదేశించారు. వాటికి ఎస్.ఓ.పి ఉంటే వాటిని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి నివేదిక విధిగా వివరాలు కలిగి ఉండాలని చెప్పారు. ఎటువంటి సంఘటనలు ఎక్కడా జరగరాదని, అందుకు ప్రతి రోజు అన్ని అంశాలను ముందుగానే పర్యవేక్షణ చేసుకోవాలని అన్నారు. అనుకోని విధంగా ఒక సంఘటన జరిగితే తక్షణ స్పందన, నివారణపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనధికార, అనుమతులు లేని ఆర్.ఓ లను గుర్తించాలని అన్నారు. పారిశుధ్యం ఎక్కడా లోపం లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.శ్రీనివాస్ గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి తమ విభాగాల్లో చేపడుతున్న నీటి నమూనాల సేకరణ, పరీక్షలు తదితర అంశాలను వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు శోభారాణి మాట్లాడుతూ గత ఏడాది తెనాలి మండలం కొలకలూరి గ్రామం ఎస్.సి కాలానికి నేరుగా నీటి పథకంకు ఎక్కించిన నీటిని సరఫరా చేయడం జరిగిందని, నీటి పథకం పాచిపట్టి ఉండటం వలన సంఘటన జరిగిందని వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు.చెన్నయ్య, బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మయూరి, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గా భాయి, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ సామాగ్రిపై జి.ఎస్.టి తగ్గింపుతో ఊరట



**గుంటూరు, మేజర్ న్యూస్:** భవన నిర్మాణ సామాగ్రిపై జి.ఎస్.టి తగ్గింపుతో ఊరట లభించిందని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం, వివిధ మండలాల్లో భవన నిర్మాణ సామాగ్రిపై జి.ఎస్.టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, జి.ఎస్.టి అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు. జి.ఎస్.టి తగ్గింపు నిర్ణయాలు వ్యక్తులకు, సాధారణ ప్రజలకు, అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి ఉపశమనం కలిగించడం తో పాటు వాణిజ్య సౌలభ్యాన్ని పెంచడానికి అవకాశం కలిగిందన్నారు. నిర్మాణ రంగానికి సంబంధించిన కొత్త రేట్లు, స్లాబ్ లు హౌసింగ్ ఇండస్ట్రీపై సానుకూల ప్రభావం చూపనున్నాయని చెప్పారు. తగ్గింపు ధరల వలన నిర్మాణ ఖర్చులు తగ్గి గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. గృహ కొనుగోలుదారులు, బిల్డర్లు, కాంట్రాక్టర్లకు నేరుగా లాభం చేకూరుతుందని, రియల్ ఎస్టేట్ రంగంలో డిమాండ్ పెరుగుతుందన్నారు. సిమెంట్ పై 28 శాతం ఉన్న జి.ఎస్.టి 18 శాతంకు తగ్గడం వలన చదరపు అడుగు గృహ నిర్మాణ ఖర్చు గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో గృహాలు, మౌలిక సదుపాయాలు త్వరగా పూర్తి కావడానికి ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. మార్బుల్, గ్రానైట్ బ్లాక్స్ 12 శాతం నుండి 5 శాతంకు తగ్గుదల వలన అలంకరణ, ఫినిషింగ్ సామాగ్రి చవకగా లభిస్తుందని, మధ్యతరగతికి లగ్జరీ ఫ్లోరింగ్, వాల్ క్లాడింగ్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సహజ రాళ్ల పరిశ్రమలకు డిమాండ్ పెరుగుతుందన్నారు. ఇసుక - సున్నం ఇటుకలుపై 12 శాతం నుండి 5 శాతంకు తగ్గుదల వలన పర్యావరణహితమైన, తక్కువ ఖర్చుతో కూడిన నిర్మాణాలకు పరిష్కారాలు లభిస్తుందని, సాంప్రదాయ మట్టి ఇటుకల కంటే ప్రత్యామ్నాయమైన సుస్థిర నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సాహం లభించడానికి తోడ్పడుతుందన్నారు. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, ఫ్రేములు, ప్యానల్లు ధరలు తగ్గుముఖంతో గృహాలలో ఇంటీరియర్ ఫిట్టింగ్స్, చెక్క పనులు ఖర్చు తగ్గుతుందన్నారు. తక్కువ ఖర్చు వల్ల ప్రాజెక్ట్ ఖర్చు తగ్గి "హౌసింగ్ ఫర్ ఆల్" లక్ష్యం సాధించడంలో జి.ఎస్.టి సహకరిస్తుందని పేర్కొన్నారు. సిమెంట్, రాయి, చెక్క, బాంబూ రంగాలలో డిమాండ్ పెరగడంతో నిర్మాణ రంగం, అనుబంధ పరిశ్రమల్లో ఉపాధి పెరుగుతుందని వివరించారు.